అనంతరాగాల విషాదంలోంచి కన్నీటిని పిండుకొంటూ, రెప్పల్ని సూదుల్తో కుట్టేసికొని చూపుల్ని చిదిమేసిన శూన్యంలో నువ్వు క్షణమొక యుగంలా నిరీక్షిస్తావనీ.. నాకు తెలుసు.

అమ్మా...

నీ కడుపులో మొగ్గతొడిగిన నిమిషాన ఈ ప్రపంచమొక పద్మవ్యూహమనీ... నువ్వొ ఒక తలారి 'కన్నె' తల్లివని...

పెరుగుతున్న శవమై నీ కడుపు మీద నే సమాధిగా పొడుచుకొస్తే.. చమురులేని సమిధలు పెట్టి త్యాగాలతో అలంకరించకు... కత్తుల్ని, కత్తెర్లనీ నా కన్రెప్పల అంచున సాన పట్టనీయకు... ఊపిరి సలపని ఈ గుహలో నీ పేగుల్లోనే ఉరి బిగించుకునే ముందు ఒక్క మాట నీతో చెప్పనీ!...

# ప్రశ్నించే పుష్పం

'ఆమె' చప్పున తన పొత్తికడుపుమీంచి చెయ్యి తీసేసుకుంది. గుండెల్లో దుఃఖం సుళ్ళు తిరుగుతుంటే బాధగా కళ్ళు మూసుకుంది.

ధారాపాతమైన కన్నీళ్ళు నిశ్శబ్దంగా చెక్కిళ్ళను అభిషేకిస్తున్నాయి.

గొంతులో దోబూచులాడుతున్న వెక్కిళ్ళు గరాశాన్ని నింపుతున్నాయి.

ఒక్కసారి కళ్ళు తెరచి చీరకుచ్చిళ్ళ కింది గర్భాన్ని చూసుకుంది భయం భయంగా...

ఎప్పుడైనా చెయ్యి వేస్తే.. ఆ శిశువేదో చెపుతున్నట్లు.. బాధగా రోదిస్తున్నట్లు... అమ్మా అని ఆర్తితో పిలుస్తున్నట్లు... ఒక మాట చెప్పాలన్నట్లు...

వాడి మాటలన్నీ ప్రకంపనాలై ఆ చేతి వెంట మనసుని తాకుతున్నాయి.

ఆమె పేరు.. మౌనిక

పదకొండు అంతస్థుల అతి పెద్ద ఆస్పత్రిమీద టెర్రస్ వైపున్న ఒకే ఒక ప్రత్యేకమైన గదిలో ఆమె ఉంది. ఆమెకా ప్రత్యేక గది ఎందుకంటే... రహస్యంగా శిశువుని కనాల్సి ఉన్నందుకు, పెళ్ళికాకుండానే గర్భం ధరించినందుకు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో ఉంటూ స్టెనోగా ఉద్యోగం చేస్తున్న మౌనిక ప్రేమలో పడింది.

ప్రేమనించి కామం...

కామం నుంచి కడుపు...

మనసుని కాక శరీరాన్ని ప్రేమించిన ఆ యువకుడు ఆమె గర్భం పెరుగుతుంటే చూడలేక పారిపోయాడు.


మౌనిక ఎదురుచూసింది. తర్వాత ఏడ్చింది. ఆ తర్వాత వాడి ఉద్దేశం గ్రహించి ద్వేషించింది. అప్పటికి నాలుగు నెలలు గడిచాయి. పరిస్థితిని అర్థం చేసుకున్న రూమ్మేటు శారద ఆస్పత్రిలో రహస్యంగా జాయిన్ చేసింది. ఆమె ఆరోగ్య రీత్యా అబార్షన్ చేయనని ఖచ్చితంగా చెప్పింది డాక్టర్. ఫలితంగా లాస్ ఆఫ్ పే మీద ఆరు నెలల సిక్ లీవ్ ఇచ్చి పెరుగుతున్న గర్భాన్ని పోషించాల్సి వచ్చింది.


మౌనిక ఇప్పుడు నిండుచూలాలు.

పాపానికి పశ్చాత్తాప పడుతూ, అనుక్షణం రోదిస్తూ బేలగా కిటికీలోంచి కిందికి చూస్తే కదులుతున్న జనాన్ని, వాహనాల్ని చూస్తూ రోదిస్తుంది.

ఒక స్నేహితురాలిగా కాక ఆత్మీయురాలిగా శారద ఊరడింపు మాటలు మౌనికని ఆత్మహత్యకు పురికొల్పనీయలేదు. అలాంటి ఆలోచన వచ్చినప్పటికీ...

ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం ఆమెని కృంగదీసేది. మళ్ళీ ఉదయాన్ని చూసి భయపడేది. ఒక చిత్ర





మైన భ్రాంతికి లోనవుతూ భయంగా ఉంటోంది.

అప్పుడప్పుడూ వచ్చే నర్సుల పలకరింపులు, టిఫిన్ బాక్స్ తెచ్చినప్పుడు శారద ఓదార్పులు తప్ప అనుక్షణం తల్లిదండ్రుల్ని గుర్తు చేసుకొని నిలువెల్లా వణికిపోయేది.

తండ్రి తనకోసం హాస్టల్ కి గానీ వస్తే...???

శారదరాగానే మౌనిక అడిగే మొదటి ప్రశ్నది! శారద నవ్వేది. ఓ రోజు సాయంత్రం...

శారద కిటికీ లోంచి కింది జనాన్ని చూస్తూ...,

"మౌనీ.. నీ గర్భసంచి పలుచగా ఉండటంవల్లే డాక్టర్ అబార్షన్ కి ఒప్పుకోలేదు. రేపో మాపో నీకు శిశువు పుడుతుంది.

ఆ శిశువుని ఏం చేద్దామనుకుంటున్నావు??"

ఉల్కిపడింది మౌనిక.

'అవునూ.. ఇన్నాళ్ళూ ఆ ఆలోచనే రాలేదు.. శారదా.. నన్నేం చెయ్యమంటావ్ చెప్పవే?" అని శారద భుజమ్మీద వాలి బావురుమంది.

క్షణం పాటు కళ్ళు మూసుకున్న కామానికి తొమ్మిది నెల్లు మోస్తున్న భారానికి తోడు అవివాహితగా ఆమె బాధను పూర్తిగా అర్థం చేసుకున్న శారద మౌనిక తలమీద చెయ్యేసి ఓదార్చింది.

"ఆ శిశువుని మాత్రం చంపొద్దు" మౌనిక వెక్కిళ్ళ మధ్య అంటే శారద నవ్వుకుంది "పెళ్ళి కాకపోయినా.. కన్న తల్లి ప్రేమ కన్నతల్లిదే" అన్న భావం ఉందా నవ్వులో.

"మరేం చేద్దామంటావ్?"

మౌనిక మాట్లాడలేదు.

"మన పరిస్థితి ఇక్కడి హెడ్ నర్స్‌కు పూర్తిగా తెలుసు. నేను ఆమెతో మాట్లాడుతాను. ఒక వారం రోజుల్లో నువ్వు మామూలు మనిషివి కావాలి సరేనా?"

హెడ్‌నర్స్‌తో ఏం మాట్లాడుతావు

"శిశువుని సంతానంలేని వాళ్ళకి ఇస్తుందామె. ఆమె కిలాంటివి మామూలే. కాకపోతే శిశువుని మన పక్కనించి తొలగించినందుకు మూడొందల వరకూ ఇచ్చుకోవాలి"

చప్పున తలెత్తింది మౌనిక.

ఆ కళ్ళల్లో నీటి పాయలు ఫూటలా సాగుతున్నాయి.

అనునయంగా మరోసారి భుజం తట్టింది శారద.

"ఏ ఆశీస్సులూ అందుకోని మా మట్టి వేళ్ళు నెత్తుటి పువ్వులై వికసించే ముందు నిప్పులు కురవాల్సిన నీ కళ్ళలోంచి నీటి ధారలెందుకమ్మా...

పురుడుతోనే మృత్యువు పత్రాన్ని పట్టుకొచ్చే అనామకుడ్నయి 'అమ్మా' అని కడుపులోంచి అరచినా విన్పించుకోని నీ కఠినపు గుండె శిలలమీద నరాలతో ఉరిపోసుకునే ముందు.. ఒక్కమాట నీతో చెప్పనీ.."

మౌనిక మళ్ళీ చప్పున చేయి తీసేసుకుంది తన గర్భం మీంచి.

గుండె వేగం పెరిగితే.. చెమట నుదుటి నంతా ఆక్రమించుకొని మెరుస్తోంది. బరువైన శ్వాస భారంగా వస్తుంటే.

"శిశువు మాట్లాడుతోందా...? ఏమి చెప్పాలనుకుంటోంది...? ఇది తన భ్రాంతా? తనే భ్రమపడుతోందా? వద్దు.. తనని నిలదీస్తే...?

ఆ ఊహే భయంకరం అన్నట్టుగా ఆలోచిస్తూ కూచుంది. మౌనిక. తలుపు నెమ్మదిగా తీసుకొని శారద వచ్చింది.

శారదకు ఏం చప్పాలో.. ఎలా చెప్పాలో అర్థంగాని స్థితి.

"మౌనీ.. మళ్ళీ ఏమయిందే?" మౌనిక మొహంలో తారట్లాడుతున్న భావాల్ని పసిగట్టి అడిగింది శారద. భగవాన్... ఈ దురవస్థ ఏ ఆడదీ తెచ్చుకోకూడదనుకుంటూనే...

"శిశువు... ఏమో చెప్పాల...ను...కుంటు..."

శారదగట్టిగా నవ్వింది.

"నీ కన్నీలేనిపోని అనుమానాలే.. కంట్రోల్ యువర్ సెల్ఫ్.... లేకుంటే హిస్టీరియాకు లోనవుతావు" హెచ్చరిస్తున్నట్టుగానే చెప్పింది శారద.

"ఈ రెండు రోజులు నువ్వు నా దగ్గరే పడుకో..." శారద కుడి చేతిని తన చేతిలోకి తీసుకొంటూ అంది మౌనిక.

సరే... హెడ్‌నర్స్‌తో కూడా మాట్లాడాను. ఇదంతా ఓ పీడకల అనుకో... ఏ ఆలోచనలూ పెట్టుకోనని నాకు మాటివ్వు...? అంది శారద.

అప్పుడే సన్నగా నడుంలో మెరిసిన నొప్పి... క్షణాల్లో వెన్నముకంతా ప్రాకి కళ్ళముందు అగ్నిగోళం కన్పించినట్లయి బాధతో అరిచింది మౌనిక.

**కె.వి.నరేందర్**

శారద చప్పున కిందికి పరిగెత్తింది.

నర్స్‌తో సహా వచ్చేసరికి మౌనిక నడుం పట్టుకొని మెలికలు తిరుగుతోంది. బాధకొద్ది మంచాన్నంతా ఆవరించుకొని పొర్లుతోంది.

"నేనొక ప్రళయం...

అంతానికి ప్రణవం..."

ప్రవచించే అగ్ని వేదాల సాక్షిగా అడుగు పెట్టే అర్హతలేక అంధకారపు గుహలో అజ్ఞాతపు జీవితానికి అంతిమ గీతపు ఆఖరి చరణంలో నేనొక అరుణం...

కళ్ళగుహల్లో కుండపోతయైన నెత్తుటి వరుణం.. 'కన్నె' తల్లుల శిశుమేధపు యజ్ఞంలోంచి

మొలకెత్తిన రుధిర కేతన...

చలనాలు చాలించే మృత్యువు పొత్తిళ్ళలో పొదిగిపోయే ముందు అమ్మా... ఒక్క మాట నీతో చెప్పనీ..."

అంత బాధలోనూఆమె నడుంమీంచి చేయి తీసేసింది. ఆ శిశువు రోదన మెదడ్ని కుదిపేస్తుంటే...

"శారూ... శిశువేదో.. చెప్పాలను..."

శారద భృకుటి ముడిపడింది కానీ అప్పటికే నర్స్ ఇంజక్షన్ చేయటంతో మౌనిక మగతలోకి పోయింది.

అరమోడ్పులైన కళ్ళకింది నుంచి పక్కలోకి చూస్తే పసిముద్ద.. విలాసంగా నవ్వుతోంది. ఆ పసిగుడ్డు నుదుటిమీద పెద్ద పుట్టుమచ్చ.

మౌనిక కళ్ళు విప్పార్చింది.. ఆడ శిశువు.

కన్నీటి పొరలు పేరుకుపోతుంటే చాలా సేపు చూడనివ్వకుండా శారద తన మునివేళ్ళతో మౌనిక రెప్పల్ని మూసింది బయటికొచ్చిన రెండు కన్నీటి బొట్లల్లో పాప ప్రతిబింబాలు.. అప్పటికే ఆ తల్లి గుండె గదుల్లో ముద్రితమైన కోట్లాది ప్రతిరూపాలు...

అప్పుడే వచ్చిన హెడ్ నర్స్...

"శిశువుని తీసు కెళ్తున్నాను.. ఈ గుడ్డు గురించిన ఆలోచనలు మీరిక మానుకోవాలి..."

ఒకకేరింత దూరమైపోయింది...

గదిలో మళ్ళీ ఇద్దరు...

మౌనిక కేదో బరువుదిగిపోయినా... శారద ఒడిలో తలదూర్చి బావురుమంది.

ఏదో చెప్పాలని.. ఏమీ చెప్పకుండానే దూరమైన ఆ శిశువు ప్రతి బింబాలు కదలాడుతున్నాయి.

"రేపు డిశ్చార్జి అవుదాం... నిన్ను ఇంటి దగ్గర విడిచి పెడతాను. కొన్నాళ్ళు రెస్టు తీసుకో..." చెప్పింది శారద.

మౌనికింకా వెక్కుతూనే ఉంది.

రెండు రోజుల తర్వాత...

సంధ్య వాలుతున్నపుడు ఇంటకి చేరిన మౌనికని చూసి తల్లి తల్లడిల్లింది. గిక్కిపోయిన బిడ్డని చూసి.

దుఃఖాన్ని ఉగ్గబట్టుకొని ఉబికి వస్తున్న కన్నీళ్ళని అణిచిపెట్టుకుంటూ

"నాన్నింకా రాలేదామ్మా...?" అని అడిగింది.

మౌనిక తండ్రి మున్సిపల్ ఆఫీసులో ట్రక్కుడ్రైవర్

"వస్తాడు... నువ్వేమిటే ఇలా అయ్యావ్?"

తల్లి ప్రేమ నిజాయితీగా ప్రశ్నిస్తోంది.

"ఏం లేదు.. రెన్నెళ్ళుగా మలేరియా..." తప్పుకొంటూ లోపలికెళ్ళి బ్రీఫ్‌కేస్ కింద పెట్టి మళ్ళీ అడిగింది. గొంతు తొణుకుతుంటే.

"నాన ఆఫీస్ నుంచి రాలే...ద్ ఏ్ం..?"

అనబోతూ గుమ్మంలో నిల్చున్న తండ్రిని చూసి అవాక్కయింది. పాదాలలో మొదలైన జలదరింపు కళ్ళలోకి పాకి నిలువెల్లా వణికిపోయింది.

తండ్రిని చూసి కాదు.. తండ్రి చేతుల్లో ఉన్న పసిగుడ్డుని చూసి.

అదే శిశువు...

అదే పసిగుడ్డు. నిర్జీవంగా...

తల్లికూడా ఆయన వైపు నిర్ఘాంతపోయి చూస్తుంటే..

"మున్సిపల్ ట్రక్కులోని చెత్తంతా ఊరి బయట పోయడానికి పోతే అదుగో..

ఆ చెత్తకుప్పలో ఈ శిశువుంది.

ఆడపిల్ల పుట్టిందని అవతల పారేసారో.. ఏ కన్నెతల్లి రహస్యంగా కని పడేసిందో... అక్కడ పందులు కుక్కలు ఈ బిడ్డ శరీరం కోసం కొట్లాడుతుంటే చూడలేక పట్టుకొచ్చాను.. మన పెరట్లో పాతి పెడదామని..."

ఆ నెత్తుటి ముద్దవైపు నిశ్చేష్టులై చూస్తున్నారిద్దరూ మౌనిక పాపనే శిలలా చూస్తూ నిల్చుంది. ఆ పాప ప్రశ్నిస్తున్నట్టుగా...

"ప్రేమ తుంచినా.. పేగు తెంచినా బంధానికి చెత్తకుప్పల్లోకి నా కేరింతల్ని అంకితం చేసే కడుపుని కడిగేసుకునే ముందు

అమ్మా.. ఒక్క మాట నాతో చెప్పనీ... ఒకే ఒక్కమాట...

నన్నెందుకు చంపాలనుకున్నావు???

అదేంటండీ.. మన పెరట్లోనా? అదే చెత్తకుప్పల్లో పాతిపెట్టలేకపోయారా? తల్లి భీతితో అడిగింది.

"నీకు తెలీదే.. అక్కడ కుక్కలు భూమిని తవ్వి తింటున్నాయి. మన పెరడు విశాలంగా ఉంది కదా... ఓ మూలన పాతిపెడదాం. నువ్వు అడ్డు జరుగు" అంటూ అతడు పెరట్లోకి నడిచాడు. అతడు చెబితే వినే మనిషి కాడని తెలుసు.

వాళ్ళు స్థాణువుల్లా చూసేలోగా పెరట్లోని గోతిలో ఆ పాప పూడ్చబడింది. వెంటాడుతున్న పాపానికి మౌనిక మనిషి కాలేక నాలుగు రోజులు మరుగున పడగానే. ఆ పెరట్లో ఓ మందార మొలక మొలిచి ఎర్రగా పూవు పూసింది.

భూమితల్లి పొత్తి కడుపులోంచి పొడుచుకొచ్చిన నెత్తుటి పుష్పంలా!! ఊగుతూ అదింకా ప్రశ్నిస్తూనే ఉంది.

ఆ ప్రశ్నకు మౌనిక దగ్గర సమాధానమెక్కడిది???

(తలారులకు... 'కన్నె' తల్లులకు ఈ కథ...)